పీఏసీఎస్ చైర్మన్లను ఇబ్బంది పెడితే చర్యలు

మహాజన సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 19 : పీఏసీఎస్ చైర్మన్లను అధికారులు ఇబ్బంది పెట్టవద్దని వారిని ఇబ్బంది పెట్టిన అధికారులపై చర్యలు తప్పవని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన డీసీసీబీ 103వ మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సహకార బ్యాంకుల్లోకి, పీఏసీఎస్‌లోకి వచ్చే రైతులకు ఉచిత సర్వీసులు చేయాలని, అలాగే చైర్మన్లను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. టెస్కాబ్ నుంచి పంట రుణాల కోసం రూ.40 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వాటిని త్వరలో కొత్త రైతులకు పంట రుణాల కింద ఇస్తామని ప్రకటించారు. అలాగే రుణాల విషయంలో అవగాహన కల్పించేందుకు అన్ని డివిజన్లలో సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. డీసీసీబీలో సబ్సిడీ రుణాల విషయంలో చాలా మందికి అవగాహన లేదని దానిపై అందరికీ అవగాహన కల్పిస్తామని అన్నారు.

మరో రెండేండ్ల వరకూ పదవీ కాలం...

దేవరకొండ బ్యాంకు విషయంలో గతంలో కొన్ని అక్రమాలు జరిగాయని వాటిని పరిష్కరించి అన్ని పీఏసీఎస్‌ల లాగానే మాకు కూడా నిధులు వచ్చేలా సహకరించాలని, అది కూడా మరో ఆరు నెలలే మీ పదవీ కాలం ఉన్నందున ఆలోపే క్లియర్ చేయాలని ఆ సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి కోరారు. దాంతో స్పందించిన చైర్మన్ ఆరు నెలలు ఎందుకు అనుకుంటున్నావ్.. ఇంకా రెండేండ్ల వరకు మన పదవీ కాలమే ఉంటుంది. ఆ విషయంలో నువ్వేం ఆలోచన చేయకు అనడం విశేషం.

తొలి సమావేశంలోనే డబ్బుల దుర్వినియోగం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల 10న మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డికి అవిశ్వాస నోటీసులు ఇచ్చిన డైరెక్టర్లు అదే నెల 28న మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డిని కొత్త చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆ తర్వాత శుక్రవారం 103వ మహాజన సభ నిర్వహించాల్సి ఉండగా దాన్ని డీసీసీబీలో నిర్వహించకుండా కొత్త పాలక వర్గం మర్రిగూడ బైపాస్‌లో ఉన్న అత్యంత ఖరీదైన ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించి లక్షల రూపాయలు వెచ్చించింది. గత నాలుగైదు పాలక వర్గాలు కూడ అదే కార్యాలయంలో నిర్వహించే మహాజన సభ కార్యక్రమం ఈ సారి కొత్తగా కొత్త పాలక వర్గం ఖరీదుగా నిర్వహించడంతో ఉద్యోగులు ముక్కున వేలుసుకున్నారు. పైగా జిల్లాలో 107 సంఘాలు, ఇతర సభ్యులు ఉన్నప్పటికీ మొత్తంగా 50,60 మందికి కూడా మించకుండా రాలేదు. ఇంత డబ్బులు, ఇంత హంగామా అనుకున్న ఉద్యోగులు కమర్షియల్ బ్యాంక్ సీఈఓను ఒక పీఏను పెట్టుకొని రైతులు లోపలికి రానివ్వని ఆయన ఇంత ఆర్భాటమేంటని నివ్వెర పోయారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నల్లగొండ రూరల్: కొత్తపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తిరుమలగిరి(సాగర్), జూలై 19: రెండున్నర సంవత్సరాలు లోపు ఉన్న చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు , చిన్నారులు, తల్లిదండ్రుల చేత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, సులోచ నరాణి, వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : మండలంలోని వెలుగుపల్లి సెక్టార్ పరిధిలోని కొత్తపల్లి అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకులు,చిన్నారులు, వారి తల్లులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుందర్‌నగర్‌లో నాలాలపై నిర్మాణాలను కూల్చివేయిస్తున్న మున్సిపల్ అధికారులు

మిర్యాలగూడటౌన్, జూలై 19 : మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న పాతఇండ్లను మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ ఆదేశాల మేరకు కూల్చివేశారు. పట్టణంలోని సుందర్ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లకు నోటీసులు ఇచ్చిన యజమానులు స్పందించకపోవడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు.అలాగే నాలాలపై అక్రమ నిర్మాణాలు, హౌసింగ్‌బోర్డ్‌లో రోడ్డు ఆక్రమిత నిర్మాణాలను, షెడ్డులను తొలిగించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సూక్తుల బోర్డులు అందజేత

నార్కట్‌పల్లి ఉన్నత పాఠశాలలో సూక్తుల బోర్డులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి, జూలై 19: నార్కట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్ విద్యార్థులు తమకు చదువు నేర్పిన బడిని మరచిపోలేదు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు సూక్తుల బోర్డులు శుక్రవారం బహూకరించారు. తరగతికి ఆరు చొప్పున పది తరగతి గదులకు మొత్తం 60 సూక్తుల బోర్డులను తయారుచేయించి ప్రధానోపాధ్యాయుడు దునుక రాములు, బహూకరించారు.కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, బి. భిక్షమాచారి, అర్థం శ్రీనివాసులు, గోసుల వెంకటేశం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

OLD AGE HOME
★ఒంటిగా హోంకేర్: పంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన విధిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | తొలుపునూరి: 9182777638

మొక్కలను నాటి కాలుష్యాన్ని పారదోలాలి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూలై 19: ప్రతి ఒక్కరూ ఇంటికొక మొక్కను నాటి కాలుష్యాన్ని పారదోలాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రైస్ మిల్లర్స్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలో ఆగస్టు 15 నాటికి లక్ష మొక్కలను నాటేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. ఇందులో భాగంగానే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 వేల మొక్కలను నాటాలని, ప్రతి మొక్కకు జీపీఎస్ చేయడం జరుగుతుందన్నారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ ప్రారంభమైతే రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున భవిష్యత్తులో మిర్యాలగూడ నియోజకవర్గంలో ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు మొక్కలను నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే ఆగస్టు 1 నుంచి మిర్యాలగూడలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని 10వేల మంది విద్యార్థులతో ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తాసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి వెంకటరమణచౌదరి, కోశాధికారి శ్రీనివాస్, మాశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లగొండ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ శ్రీనివాస్

డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

నీలగిరి, జూలై 19 : నల్లగొండ డీఎంహెచ్‌ఓ(జిల్లా వైద్యాధికారి)గా సిద్దిపేట జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ బదిలీ అయ్యారు. బదిలీల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ప్రభుత్వం ఆయనను నల్లగొండకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ డీఎంహెచ్‌ఓగా ఉన్న డాక్టర్ అన్నిమల కొండల్‌రావు మే 31న పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో జిల్లా క్షయనివారణ అధికారిగా పని చేస్తున్న డాక్టర్ కల్యాణచక్రవర్తిని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దాంతో ప్రభుత్వ నిర్వహించిన సాధారణ బదిలీల్లో జిల్లాకు వచ్చిన శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

కొంత మందికే రుణమాఫీ

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్

కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దస్రూనాయక్

కొండమల్లేపల్లి, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో అనేక మంది రైతుల పేర్లు లేవని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు కేసాని లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ తెచ్చిన ఒత్తిడి ఫలితంగానే రుణమాఫీ చేస్తున్నారని, అది కూడా పేరుకే రుణమాఫీ అని జాబితాలో పేర్ల లేని రైతులు ఎందరో ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు కటఫ్ తేదీతో సంబంధం లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. రుణమాఫీ రైతులను దూరం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు అంశాన్ని తెరపైకి తీసుకురావడం దూరదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు రమావత్ తులసీరాం నాయక్, గుండెబోయిన లింగం యాదవ్, రావుల వెంకటయ్య, ముడావత్ పాండునాయక్, పెద్దిశెట్టి సత్యం, వరికుప్పుల పాండు, తొటపల్లి శ్రీను, దాచేపల్లి నరేందర్, గోవిందనాయక్, కర్నెకంటి రజినీకాంత్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ

విద్యార్థులకు దుస్తులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శాలిగౌరారం, జూలై 19: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని మనిమద్దె, శాలిగౌరారం ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యానభ్యసిస్తున్న విద్యార్థులకు శుక్రవారం దుస్తులు, నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాత, లయన్ ఎర్ర శంభు లింగారెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డెంకల సత్యనారా యణ, మారోజు వెంకటాచారి, వడ్లకొండ భిక్షం, రాపాక రాజు, చార్టర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జగదీశ్‌బాబు, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూటీఎస్ ధ్యేయం'

మాడ్గులపల్లిలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

మాడ్గులపల్లి, జూలై 19: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ టీఎస్ పనిచేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటమ్మ, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవూఫుద్దిన్, నిరంజన్ రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, గౌరు దయాకర్, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మిర్యాలగూడ : వేములపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంతియాజ్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, సత్యనారాయణ, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్

పెద్దఅడిశర్లపల్లి, జూలై 19 : బాలాజీనగర్ వేంకటేశ్వర్ స్వామి ఆలయం ప్రధాన పూజారి (బావోజీ)మెగావత్ జాన్య (56) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. 25 ఏండ్లుగా ఆలయ అభివృద్ధికి ఎంతగానో పాటు పడ్డాడు. బావోజీ మృతదేహానికి ఎమ్మెల్యే బాలూనాయక్ పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యల్లయ్య, నాయకులు పాల్వాయి వెంకట్‌రెడ్డి, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, సతీశ్ రెడ్డి, రాంచంద్రనాయక్, బన్సిలాల్, గోవిందు, శ్రీరాం,ఉన్నారు.

విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : ఏబీవీపీ

చిట్యాల, జూలై 19 : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తున్నదని ఏబీవీపీ జిల్లా నాయకుడు సామల అఖిల్‌రెడ్డి అన్నారు. చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన సంఘం పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదుగురు సభ్యులతో ప్రారంభమైన సంస్థ నేడు 50 లక్షల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందని అన్నారు. అనంతరం సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నగర కార్యదర్శిగా కొంపల్లి సూర్య, ఉపాధ్యక్షుడిగా గణేశ్, సందీప్ వర్మ, సంయుక్త కార్యదర్శిగా పుల్లెంల గణేశ్, చరణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తనీష్, మణికంఠ, శివాజీ, బన్ని పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ అమలు చేయాలి : బీఆర్ఎస్‌వై

శాలిగౌరారం, జూలై 19 : ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్‌వై మండల ప్రధాన కార్యదర్శి చింతల శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులకు పంట పెట్టుబడి సాయం ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులు బయట అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా పెంచి ఇస్తామన్న రైతు భరోసాను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నోముల శ్రీనివాస్, పరమేశ్ ఉన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

చిట్యాల, జూలై 19 : వట్టిమర్తి శివారులోని శ్రీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇమ్మడి వెంకటేశ్వర్లు తెలిపారు. 21న సామూహిక సత్యవ్రతాలు, ఊరేగింపు ఉంటుందని, 22 కాగడ హరతి ముగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు. 24 సంవత్సరాలుగా ఈ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పాలేరుకు నీటిని తరలించడం సరికాదు :ఏఐకేఎఫ్

మిర్యాలగూడ, జూలై 19: వర్షాభావ పరిస్థితులతో నల్లగొండ జిల్లాలో చెరువులు, కుంటలు నింపకుండా ఖమ్మం జిల్లాకు ఎడమ కాల్వ ద్వారా నీటిని తీసుకెళ్లడం సరికాదని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి పందిర్లపల్లి చెరువును ఆయన సందర్శించి మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పక్కన ఉన్న గ్రామాల్లో అనేక చెరువుల్లో నీళ్లు లేక భూగర్భజలాలు అడుగంటిపోయినప్పటికీ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని ఏ ఒక్క చెరువు, కుంటలను నింపకుండా ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు పెద్దదేవుపల్లి నుంచి తూములను మూసి రెవెన్యూ, పోలీసు అధికారులను కాపలా పెట్టి ఖమ్మం జిల్లా పాలేరుకు నీళ్లు తరలించడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో పోతుగంటి కాశీ, భరత్ ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : బీజేపీ

మిర్యాలగూడ, జూలై 19 : రైతులకు రైతు భరోసా నగదును అందించకుండా రుణమాఫీ చేస్తున్నామని చెప్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. మిర్యాలగూడలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాలను పక్కన పెట్టి రాష్ట్రంలోని 11 లక్షల మంది రైతులను మోసం చేసి వారితోనే చిత్రపటాలకు పాలాభిషేకం చేయించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు, వడ్డీ కలిపి మాఫీ చేయకుండా ప్రభుత్వం రైతులను తప్పు దోవ పట్టిస్తుందన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మపల్లి హనుమంతరెడ్డి, చిలుకూరి శ్యామ్, మోదాల అశోక్, మేడి నవీన్‌లు పాల్గొన్నారు.

దేవరకొండలో రేపు సీత్లా పండుగ

చందంపేట, జూలై 19 : దేవరకొండ పట్టణంలోని బంజార భవనంలో ఆదివారం సీత్లా పండుగ నిర్వహించనున్నట్లు బంజారా సంఘం నాయకులు రమావత్ పాండు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే విధంగా సీత్లా భవాని పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని మండలాల బంజారా సంఘంనాయకులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకిరేకల్, జూలై 19 : మండలంలోని సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాల్లో కరెంటు సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ సాయిగణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల పనులను త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ రూరల్, జూలై 19 : జిల్లాలో చేపట్టిన వైటీపీఎస్, ప్రభుత్వ వైద్య కళాశాల, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎస్జీఎఫ్ కింద మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ పనులకు పూర్తిగా వంగమర్తి, గొట్టిముక్కల టీజీ ఎండీసీ రీచ్‌ల నుంచి ఎలాంటి అక్రమ రవాణాకు అస్కారం లేకుండా ఇసుకను వెంటనే పంపించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమైన పనులకు ఇసుకను పని దినాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంపించాలని, అలాగే ఇసుక పంపించే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు.

ఇసుక వాహనాలను పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క ఇసుక వాహనం దుర్వినియోగం చేసినా లేదా నిర్దేశించిన ప్రకారం కాకుండా ఇతరత్రా పనులకు వినియోగించిన అలాంటి వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు.

నేచురోపతి ఆరోగ్య సదస్సుకు ఆహ్వానం

మున్సిపల్ చైర్మన్ బుర్రి, కాంగ్రెస్ నేత గుమ్ముల మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న యానాల ప్రభాకర్‌రెడ్డి

రామగిరి, జూలై 19: ఈనెల 21న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నల్లగొండలోని చిన్నవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న 'నేచురోపతి ఆరోగ్య సదస్సు'కు హాజరుకావాలని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిని గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రిక, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రమణ, బొమ్మపాల గిరిబాబు తదితరులున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి.

మాడ్గులపల్లి, జూలై 19: మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాల యాలకు సొంత భవనాలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాడ్గులపల్లి మండలంగా ఏర్పడి 8 ఏండ్లు అవుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించకపోవడం బాధాకరమన్నారు. ఎంపీడీఓ, పోలీసు స్టేషన్, పీహెచ్‌సీ, విద్యార్థుల హాస్టల్ తదితర కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో తీవ్ర ఇబ్బందులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోని కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి, రొండి శ్రీనివాస్, బొమ్మకంటి అంజయ్య, పతాని శ్రీను పాల్గొన్నారు.

కల్లుగీత ఫెడరేషన్‌కు రూ.5 వేల కోట్లు కేటాయించాలి

● కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు

నకిరేకల్ : సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు

నకిరేకల్, జూలై 19 : బడ్జెట్ సమావేశంలో గీత ఫెడరేషన్‌కు రూ. 5 వేల కోట్లు కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్ కేఆర్ ట్రస్ట్ భవనంలో కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం గుడుగుంట్ల బుచ్చ